# సాక్షి మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 22 ✷ BI MONTHLY ✷ FOR PRIVATE CIRCULATION ONLY ✷ DECEMBER - JAN 2009



## స్పెషల్ కంపోనెంట్ ఫలాలు దళితులకు అందేనా....

...✍ - వి. నందగోపాల్

**60** వసంతాల గణతంత్ర భారతదేశంలో రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, వాటి అమలుకు ప్రజలు, పాలకవర్గాలు ప్రాతినిధ్యం వహించాలి. హక్కులు అనేవి పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక మరియు సాంస్కృతిక హక్కులుగా మనం చూసినపుడు అనాదిగా దళితులు అన్ని రకాలైన హక్కుల ఉల్లంఘనలకు గురిచేయబడుతున్నారు. అయితే, ఆర్థిక వివక్షతను మనం గమనించినట్లయితే వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడే అన్ని అంశాలలోనూ వారిని వివక్షతకు గురి చేయడం జరిగింది. ఉపాధి, వృత్తి, విద్య, ఉద్యోగం చివరకు బడ్జెట్‌లో కూడా వివక్షతే కనిపిస్తుంది. స్పెషల్ కంపోనెంట్ ప్లాన్ ద్వారా ప్రత్యేక నిధిని కేటాయించాలని అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం జి.ఓలు విడుదల చేసింది. దళితుల అభివృద్ధికి వారి జనాభా ప్రాతిపదికగా అన్ని శాఖలూ తమ మొత్తం బడ్జెట్‌లలో 16% నిధులను కేటాయించడాన్నే స్పెషల్ కంపోనెంట్‌గా పరిగణిస్తారు. కేటాయింపులు ఎక్కువ చూపడం, దళితులకు భ్రమలు కల్పించడం నిధులు వ్యయాన్ని పరిశీలిస్తే అతి తక్కువ విడుదల చేయడం పరిపాటి అయింది. వివిధ విభాగాలు, రంగాలలో కేటాయింపులు చూపిస్తూనే, అమలు మాత్రం మర్చిపోతున్నారు నేతలు. ఒక వైపు IIT, IIM లలోని సైంటిఫిక్ మరియు టెక్నికల్ ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానం నుండి 47 సంస్థలను మినహాయింపునిచ్చి, ఎస్సీ/ ఎస్టీలకు రిజర్వేషన్ విధానాన్ని నెమ్మదిగా హరించి వేయాలనే కుట్రపన్నడం, దానికి జాతీయ ప్రాముఖ్యతను అంటగట్టి, కప్పిపుచ్చడం, మరొక వైపు IIT, IIM అనుబంధంగా ఉన్న కళాశాలల్లోని ఉద్యోగాలను ఎస్సీ/ఎస్టీలకు చెందనీయకపోవడం,IIT, IIM లలోని ఎగ్జిక్యుటివ్ బోర్డుల్లో మరియు టీచర్ల సెలెక్షన్ కమిటీల్లో ఎస్సీ/ఎస్టీ సభ్యులను లేకుండా చేయడం. అంతేకాక, విద్యా ప్రమాణాలను పరిశీలించినపుడు వసతులు, పౌష్టికాహారం, స్కాలర్‌షిప్‌లు ఏమీ కూడా విద్యార్థులకు అందడం లేదనేది మనకు విదితమౌతుంది. ఇక బడ్జెట్ కేటాయింపులకు వస్తే 1983వ సంవత్సరం నుండి ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్ వరకు 18 శాతం నుండి 10.5 శాతం వరకు తగ్గించడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్‌లలో వరుసగా 10 శాతం, 20 శాతం విద్యారంగానికి కేటాయిస్తే విద్యావిస్తరణ, లక్ష్యాలకు భంగం కలుగకుండా విద్యావ్యాపారాన్ని నిషేదించవచ్చు. ప్రభుత్వం దాని శాఖలు బడ్జెట్‌ను కేటాయించడమే, కాక నిధులు విడుదల చేయడం, దానిని దళితుల అభివృద్ధి కోసమే చిత్తశుద్ధితో ఖర్చు చేసిన యెడల దళితులు పురోభివృద్ధికి వేసిన బాటలు సార్థకమవుతాయి. ఎన్ని చట్టాలు, శాసనాలు, వాటికి సవరణలు, పథకాలు, నిబంధనలు చేసినా, వాటి అమలు నిస్పాక్షికంగా, నిస్వార్థంగా అమలు చేయగలిగినప్పుడు మాత్రమే దళితుల సాధికారత ఏర్పడుతుంది, దళిత మేధావులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు, నాయకురాండ్రు, కార్యకర్తలు తమకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎదుర్కొనడానికి చేస్తున్న ఉద్యమాలు సఫలీకృతమౌతాయి.

- సాక్షి

## దళిత్ కాల్ లైన్

**నే**టి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో **సాక్షి** మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్ మరణాలు"** మొదలైన వాటి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ - 18004255535, 27737093కు తెలియజేయవల సిందిగా కోరడమైనది.

**ఇట్లు**

**సాక్షి మానవహక్కుల నిఘా**

# స్పెషల్ కాంపొనెంట్ ద్వారా దళితుల అభివృద్ధి ఎంత?

...✍ - సారంపల్లి

2009 జనవరి 26తో 60వ రిపబ్లిక్ వార్షికోత్సవంలోకి భారత్ అడుగిడింది. భారత రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ రిపబ్లిక్ ఏర్పాటు చేశారు. రాజ్యాంగంలో పౌరుల హక్కులు, బాధ్యతలేగాక వారి హక్కుల రక్షణకు నిబంధనలను రూపొందించారు. రాజ్యాంగం ఆమోదించిన నిబంధనలను అందరూ పాటించాలి. ముఖ్యంగా పాలకవర్గాలు రాజ్యాంగం అమలుకు ప్రాతినిధ్యం వహించాలి. ఆ రాజ్యాంగం రూపొందించిన హక్కులే దళితుల రక్షణకు ఉపయోగపడాలి. కానీ రాజ్యాంగం ఆమోదించినా, పాలకులు మాత్రం దానిని అమలుచేయడంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని పాటిస్తున్నారు. అలాంటి దానిలో దళితులకు కేటాయించిన స్పెషల్ ఎకనమిక్ కాంపొనెంట్ ఒకటి. కేంద్రం, రాష్ట్రాలు ఆమోదించిన చట్టాలు, నిబంధనలు అమలు ఎందుకు జరుగుటలేదు? దీనికి ఎవరు బాధ్యులు?

1980లో ప్రత్యేక ఆదేశాలు జారీచేస్తూ దళితుల అభివృద్ధికి " స్పెషల్ ఎకనమిక్ కాంపొనెంట్ " ద్వారా వారి అభివృద్ధికి ప్రత్యేక నిధిని కేటాయించాలని అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. జనాభా ప్రాతిపదికగా ప్రతి శాఖ తను వ్యయం చేస్తున్న నిధులలో విధిగా దళితుల అభివృద్ధికి మాత్రమే కేటాయించాలని చెప్పారు. దళితుల అభివృద్ధికి వారి జనాభా ప్రాతిపదికగా అన్ని శాఖలూ తమ బడ్జెట్‌లలో నిధులను కేటాయించడాన్నే స్పెషల్ కాంపొనెంట్‌గా పరిగణిస్తారు. ఈ కేటాయింపుకు కేంద్ర ప్రణాళికా సంఘం ఆమోదం తెలిపింది. తద్వారా ఈ కేటాయింపు చట్టబద్ధంగా మారింది. ఈ చట్టబద్ధతను అన్ని శాఖలూ తప్పనిసరిగా పాటించాలి. అందుకు భిన్నంగా ఏ శాఖా నిధుల కేటాయింపును తగ్గించకూడదు. రాష్ట్ర ప్రణాళికా బడ్జెట్‌నుండి ఈ నిధులు కేటాయించాలి. 2008-09 ప్రణాళికా బడ్జెట్ దాదాపు 50వేల కోట్లుంది. అంటే స్పెషల్ కాంపొనెంట్ క్రింద రు. 8100 కోట్లు కేటాయించాలి. ప్రణాళికా బడ్జెట్‌లో రాష్ట్ర ఇరిగేషన్‌కు రు. 16400 కోట్లు కేటాయించారు. దీనిలో రు. 2600 కోట్లు కేటాయించాలి. ఈ నిధులతో దళితుల భూములకు సాగునీటి వనరులు కల్పించాలి. ఇది జరుగుతున్నదా?

ప్రస్తుత సంవత్సరంలో 16.2 శాతంగా కేటాయింపులు చేయాలి. కానీ, 2008-09లో రాష్ట్ర ప్రభుత్వం 17.3శాతం కేటాయించి అత్యధికంగా నిధులను దళితులకు వివిధ శాఖల ద్వారా యిస్తున్నట్లు ఘనంగా బడ్జెట్ ప్రసంగంలో మంత్రి రోశయ్యగారు సెలవిచ్చారు. బడ్జెట్ ముగింపు ఉపన్యాసంలో ముఖ్యమంత్రిగారు మరింతగా నొక్కి ఈ ప్రత్యేక కాంపొనెంట్ ద్వారా దళితులు అభివృద్ధి అవుతారని శాసనసభలో చెప్పారు.

| సంవత్సరం | స్పెషల్ కాంపొనెంట్ (రు. కోట్లలో) | కేటాయించినవి (రు. కోట్లలో) | జరిగిన వ్యయం (రు. కోట్లలో) |
|---|---|---|---|
| 2004-05 | 1993.68 | 1181.03 | 1341.50 |
| 2005-06 | 2347.62 | 1445.35 | 1341.50 |
| 2006-07 | 3240.00 | 1537.00 | 2250.25 |
| 2007-08 | 5340.87 | 4249.00 | 3460.00 |
| 2008-09 | 6997.00 | 7470.00 | 2500.00 |

*(నవంబర్ 2008 నాటికి)*

పై పట్టికను పరిశీలిస్తే చట్టబద్ధంగా కేటాయించాల్సిన కాంపొనెంట్ కన్నా అదనంగా కేటాయింపులు చూపినా వాస్తవ వ్యయం మాత్రం కాంపొనెంట్ మొత్తానికి తగ్గింది. కేటాయింపులు ఎక్కువచూపడం, దళితులకు భ్రమలు కల్పించడం నిధుల వ్యయాన్ని పరిశీలిస్తే అతి తక్కువ విడుదల చేయడం పరిపాటి అయింది. స్పెషల్ కాంపొనెంట్ ప్రకటించినప్పటినుండి నేటికి దాదాపు రు. 20వేల కోట్లు దారిమళ్ళినట్లు తెలుస్తుంది. ఇలా దారిమళ్ళడంపై గతంలో రాష్ట్ర ఆడిట్ నివేదికలో కూడా విమర్శలు వచ్చాయి. అయినా ప్రభుత్వాలు ఆ విమర్శలను "బుట్టదాఖలు" చేశాయి. అనునిత్యం దళితుల అభివృద్ధికి తామంతా కృషిచేస్తున్నట్లు ఫోజులు మాత్రం పెడుతున్నారు.

104 ప్రభుత్వ శాఖలు స్పెషల్ కాంపొనెంట్‌ను కేటాయించి అమలుజరపాలి. అనేక శాఖలు కేటాయింపులు కూడా చేయలేదంటే అతిశయోక్తికాదు. ఈ నిధులతో భూముల కొనుగోలుకు, ఉపాధి కల్పనకు, ఇళ్ళ స్థలాల కొనుగోలుకు, విద్యారంగంలో స్కాలర్‌షిప్పులకు మరియు సంక్షేమ పథకాలకు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, భూమి అభివృద్ధి, స్వయం ఉపాధి పథకాల ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన వున్నవారిని ఎగువకు తేవడానికి ఈ స్పెషల్ ఎకనమిక్ కాంపొనెంట్‌ను వినియోగించాలి. ఇప్పటికి దళితుల్లో 40శాతం దారిద్ర్యరేఖకు దిగువన వున్నారని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. కానీ, వాస్తవానికి

దళితుల్లో 60శాతానికి పైగా అత్యంత దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారు. గ్రామాల్లోని దళితవాడలను సందర్శిస్తే నేటికీ గృహవసతితో పాటు తిండి, బట్టకు నోచనివారు కనబడతారు. ఏపూటకాపూట వెళ్ళదీయడానికి యిబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారికి పౌష్టికాహారం యిప్పించి అభివృద్ధి చేస్తామని ఐసిడిసిఎస్ సంస్థలు ఏర్పాటు చేశామన్నారు. ఆ సంస్థలు అందించే సహాయం కూడా నామమాత్రమే.

ఇప్పటికి దళితుల్లో శిశుజనన సందర్భంగా మరణిస్తున్న తల్లుల సంఖ్య తక్కువేమీకాదు. దీనికి ప్రధాన కారణం రక్తహీనత, పౌష్టికాహార లోపమేనని వైద్యులు చెబుతున్నారు. నేడు దళితులలో 60శాతం మంది పౌష్టికాహారానికి అతి దూరంగా వున్నారు. ఆహారమే లేనివారికి పౌష్టికాహారం ఎక్కడ? ఇలాంటి వారిని సమాజంలో అభివృద్ధిలోకి తెస్తామని 1947 నుండి ఉద్ఘోషిస్తూనే వున్నారు. రాజ్యాంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించారు. ఎప్పటికప్పుడు జీవోలు విడుదల చేస్తున్నారు. కానీ, దళితులు మాత్రం "ఎక్కడవేసిన గొంగళి అక్కడే"అన్న చందంగా వున్నారు.

బ్యాంకులు కూడా తమ వ్యాపార ధనంలో జనాభా ప్రాతిపదికగా 16.2శాతం రుణాన్ని దళితులకు యివ్వాలి. నేడు 5శాతం కూడా వారికి యివ్వడంలేదు. బ్యాంకుల సమీక్షలలో మాత్రం రుణం పొందే అర్హతగల వారు లేరని ప్రచారం చేస్తున్నారు. కనీసం 15శాతం తమ వ్యాపార ధనంలో రుణ సౌకర్యం విధిగా కల్పించాలి. అందుకు భిన్నంగా వున్న ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకొనేవిధంగా నిబంధనలు రూపొందించాలి.

శాసనసభలో ప్రవేశపెట్టిన దళిత సంక్షేమ బడ్జెట్‌ను పరిశీలిస్తే మరిన్ని ఆశ్చర్యకర సంఘటనలు తెలుస్తాయి.

2008-09 సంవత్సరంలో రు. 2251.03 కోట్లు దళిత సంక్షేమ శాఖకు కేటాయింపు చూపారు. ఇందులో విడుదల చేసేదెంతో, తిరిగి రివైజ్డ్ ఎస్టిమేషన్స్ వేసి తగ్గించేది ఎంతో, ఫిబ్రవరి-2009 చివరగాని తెలియదు. 2001 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 123.39 లక్షలు (16.19శాతం) దళితులు వున్నారు. కేటాయింపులు మాత్రం 16.2 శాతానికే చేస్తున్నారు. 06-06-2003న గెజెట్ యంఎస్‌నెం. 33 ప్రకారం రాష్ట్రంలో దళిత సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. దీనిద్వారా 1995 పౌర హక్కుల చట్టాన్ని పరిరక్షించడం, 1989 అత్యాచార చట్టాన్ని అమలుచేయడంతో పాటు వారి సంక్షేమానికి కూడా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. చట్టాలు ఎన్ని వున్నా దళితులకు పౌరహక్కుల రక్షణలోను, అత్యాచారాల నిరోధకంలోను పెద్దగా సాధించిందేమీలేదు. దళితులపై అకృత్యాలు, అఘాయిత్యాలు జరుగుతూనే వున్నాయి. దళితులను విద్యారంగంలో అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే సమస్య కొంత పరిష్కారమవుతుంది. పట్టణాల్లో కొంతమేర చైతన్యం పెరిగినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని దళితుల్లో తమ హక్కుల సాధనలో చైతన్యాన్ని పెంచాల్సివుంది.

విద్యారంగం : దళితుల్లో ఉన్నత విద్య గడపడానికి ఉచితంగా స్టడీ సర్కిల్స్, కోచింగ్ సెంటర్స్ నిర్వహించాలని బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు గ్రూప్-1, గ్రూప్-2స్థాయి పరీక్షలకు హాజరయ్యేవిధంగా ఉచిత కోచింగ్‌తో వారిని తయారుచేయాలి. ఉద్యోగాలలో వారికి కేటాయించబడిన రిజర్వేషన్ల సంఖ్యకు తగ్గకుండా వారిని అభివృద్ధి చేయడానికి ఈ పథకాన్ని రూపొందించాలి. అయినప్పటికీ సరియైన అభ్యరులు లేరన్న వాదనతో అనేక రిజర్వేషన్ ఉద్యోగాలు ఖాళీగా పెడుతున్నారు. హాస్టళ్ళ అభివృద్ధి, స్కాలర్‌షిప్‌ల పెంపుదల చేయాలని నిర్ణయించినా, ఆ హాస్టళ్ళు మురికి కూపాలుగానే వున్నాయి. బాలికల హాస్టళ్ళు మరింత దారుణంగా వున్నాయి. కనీస శానిటరీ సౌకర్యాలు కూడా లేనివి చాలా వున్నాయి. 70శాతం దళితులే వుండేవిధంగా నిర్ణయం చేసినా కొన్ని హాస్టళ్ళలో వారికి కేటాయించిన శాతం కూడా భర్తీ కాలేదు. హాస్టళ్ళ భవనాలు శిథిలావస్థలో వున్నాయి. వాటి రిపేర్ల గురించి ఆర్ & బి శాఖగానీ, పిడబ్ల్యుడి శాఖ గానీ పట్టించుకోదు. బుక్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశారు. కానీ పుస్తకాల సరఫరా వుండదు.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలంటూ అనేక సంవత్సరాలుగా దళితులు ఆందోళనలు చేస్తూనే వున్నారు. ఇన్ని సంక్షేమ చర్యలు చేపట్టినప్పుడు వారికి కేటాయించబడిన ఉద్యోగాలకు అర్హతగల అభ్యర్థులు ఎందుకు దొరకడంలేదు? దీనినెప్పుడైనా ప్రభుత్వం సమీక్షించిందా?

కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రు. 5వేల నుండి 10వేలకు సహాయాన్ని పెంచారు. ఈ సహాయాన్ని పొందడానికి ఎంత ఖర్చు చేయాలో ! అసలు కులాంతర వివాహాలను ప్రోత్సహించి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాధికారులే అగ్రకులాల వారి అధికారానికి లొంగి వివాహాలకు ఆటంకాలు కల్పిస్తున్న ఘటనలు అనేకం వున్నాయి. అనాథలను సంరక్షించడానికి ఆనంద నిలయాలు, అనాద సదనాలు ప్రారంభించారు.

( ☛ తరువాయి 6వ పేజీలో....)

# IIT, IIM లు జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు కాబట్టి మీరు రావద్దు

...✍ - బత్తుల కార్తిక్ నవయాన్

డిసెంబర్ 23,2008 రోజున మధ్యహ్నం 2 గ॥ల నుండి 3 గం॥ల సమయంలో రాజ్యసభలో 18 బిల్లులు పాస్ చేశారు. అందులో The Scheduled Casts and Scheduled Tribes (Reservation in posts and services) Bill- 2008 ది షెడ్యూల్డు క్యాస్ట్ షెడ్యూల్డు ట్రైబ్స్ (రిజర్వేషన్ ఇన్ పోస్ట్ అండ్ సర్వీసెస్) బిల్ – 2008 కూడ ఒక్కటి.

ఈ బిల్లు పేరు వినగానే ఎవరికైనా ముందుగా అర్థం అయ్యేది ఏమిటంటే ఈ బిల్లు యస్సీ, యస్టీలకూ రిజర్వేషన్ కల్పించే ఉద్దేశ్యంతో తీసుకువస్తున్నదని అనుకుంటాము. కానీ ఇది రిజర్వేషన్ విధానాకి వ్యతిరేకమైన బిల్లు.

ఈ బిల్లులోని సెక్షన్ 4 సబ్ సెక్షన్ (1) ప్రకారంగా దేశవ్యాప్తంగా ఉన్న 47 IIT మరియు IIM లలోని సైంటిపిక్ మరియు టెక్నికల్ ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానం నుండి ఈ 47 సంస్థలనూ మినహాయింపునిచ్చారు. దానికి వారు చెపుతున్న కారణం ఏమిటంటే ఈ 47 IIT లు IIM లు జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు కాబట్టి అంటే IIT, IIM లు మాత్రమే జాతీయ ప్రాముఖ్యత కలిగినవి దేశంలో మిగిలిన ఇతర విద్యాసంస్థలన్ని జాతీయ ప్రాముఖ్యత లేనివని వీరి ఉద్దేశమా ? రేపు ప్రభుత్వం పార్లమెంటు మరియు శాసన సభలు జాతీయ ప్రాముఖ్యత గలిగిన సంస్థలు అని చెప్పి వాటిల్లో కూడా రిజర్వేషన్ విధానాన్ని ఎత్తేస్తారా ?

ఇంకా దేశంలోని ఇతర ఏ రంగాన్నాయినా, ప్రభుత్వం జాతీయ ప్రాముఖ్యత కలిగినదిగా ప్రకటించి అందులో రిజర్వేషన్ విధానాన్ని ఎత్తేయవచ్చునన్నమాట. దేశంలోని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్ళు, కాలేజీలు, విద్యాలయాలు కూడా జాతీయ ప్రాముఖ్యత కలిగినవి కాబట్టి వాటిల్లోకూడా రిజర్వేషన్ విధానం ఎత్తేస్తారు.

ఈ రకంగా చెప్పుకుంటూపోతే ప్రభుత్వం ఏదయిన ఒక సంస్థను లేదా ప్రభుత్వం శాఖను జాతీయ ప్రాముఖ్యత కలిగినదిగా ప్రకటిస్తే ఇక అందులో రిజర్వేషన్ విధానాన్ని పాటించే అవసరం లేదన్న మాట, భవిష్యత్తు మొత్తం రిజర్వేషన్ విధానానికి తూట్లు పొడిచే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ బిల్లు రాజ్యసభలో కేవలం 3 నిమిషాల వ్యవధిలో పాస్ అయ్యింది.

అంబేద్కర్ 40 సం॥రాల జీవన్మారణ పోరాటంతో సాధించిన రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా కేవలం 3 నిమిషాల్లో బిల్లు పాస్ చేయడం మన రాజ్యసభ ఉన్నతత్వానికి ఒక మచ్చ. ఏ మాత్రం చర్చలేకుండా ఈ బిల్లు పాసుకావడం అందులో ఉన్న రాజ్యసభ సభ్యుల మేధవిత్వాన్ని, నిజాయితీని శంకించవలసిన సందర్భం ఇది.

రాజ్యంగ స్ఫూర్తి విరుద్ధమయిన బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టి పాస్ చేస్తుంటే అందులో కూర్చున్న సభ్యులు ఏమి చేస్తున్నారో తెలసుకోవాలనే కోరిక చాల మందికి లాగే నాకు కూడా ఉంది. ముఖ్యంగా రాజ్యసభలో కూర్చున్న దళిత ఎం.పి.లు ఈ బిల్లు పాసవుతుంటే ఏం చేస్తూ ఉండి ఉంటారో ?

ఈ బిల్లు రాజ్యంగ స్ఫూర్తికి విరుద్ధం. అంతేకాకుండా 2005 డిసెంబర్ 6న భారత మానవ వనరుల శాఖ ఆర్డరు నం 6–30/2005 O.S. ప్రకారం యూనివర్సిటీ గ్రాంట్లు పొందుతున్న అన్ని యూనివర్సిటీల్లోని లక్చరర్, రీడర్, ప్రొఫెసర్ ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాన్ని పాటించాలని చెప్పడం జరిగింది. ఇదే ఆర్డరును మానవవనుల శాఖ జూన్ – 2008లో దేశంలోని అన్ని IIT లకుIIM లకు కూడా పంపడం జరిగింది. ఇక్కడ ఉద్యోగాలను రిజర్వుచేయడం అయితే జరిగిందిగానీ అభ్యర్థుల శక్తిసామర్థ్యాల విషయంలో ఎలాంటి మినహాయింపు లేదు.

జూన్ 2008లో వచ్చిన ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా డిసెంబర్ 2008లో బిల్లు పాసుచేయడం వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో అర్థం కావడం లేదా ?

ఈ బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టబోతున్నారు కనీసం పార్లమెంట్ లోనయినా దళిత యం.పి.లు దీన్ని అడ్డుకోవాలి ఈ బిల్లులోని సెక్షన్ 4ను తొలగించాలి లేదంటే మొత్తం రిజర్వేషన్ విధానానికే ప్రమాదం వస్తుంది.

హిందూ బానారస్ యూనివర్సిటీలో 2300 టీచింగ్ పోస్టులు ఉన్నాయి. సగటున ప్రతి IIT, IIM లో 500 టీచింగ్ పోస్టులు అనుకున్నా 47 X 500 = 23,500 ఉద్యోగాలలో 5287 ఉద్యోగాలు యస్సీ/యస్టీలతో నింపాలి మరి అంత మంది ఉద్యోగులు IIT, IIM లలో ఉన్నారా ? ఇంకా ఈ IIT, IIM లకు అనుబందంగా ఉన్న కళాశాలల్లోని ఉద్యోగాలను కూడా లెక్కిస్తే 10000 పైన ఉద్యోగాలు యస్సీ, యస్టీలకు చెందాలి.

ఈ సందర్భంగా మరోవిషయాన్ని గుర్తుచేసుకోవాలి ఉన్నత విద్యాలయాలల్లోని IIT, IIM లలోని ఎక్సిక్యూటివ్ బోర్డుల్లో మరియు టీచర్ల సెలక్షన్ కమిటీల్లో యస్సీ, యస్టీ సభ్యులు లేరు. కాబట్టి యస్సీ, యస్టీ అభ్యర్థులు పట్ల సెలక్షన్ కమిటీలు వివక్ష

( ☛ తరువాయి 8వ పేజిలో....)

( ☛ 4వ పేజి తరువాయి ....)

ఈ సదనాలలో 100 సీట్లు నిర్ణయించి అందులో 50శాతం అనాదలు, 50శాతం అపరిశుభ్ర వృత్తి చేస్తున్న వారికి కేటాయించారు. రాష్ట్రంలో బాలుర సదనాలు 46 వుండగా, బాలికల సదనాలు 33 మాత్రమే వున్నాయి. ఇవి అనాదలకు ఏమేరకు సహకరిస్తాయి?

ప్రధానంగా తమ జీవనాదాయాన్ని తామే కల్పించుకొనేవిధంగా తమకున్న కొద్దిపాటి భూమిని అభివృద్ధి చేసుకోవడానికి వాటర్‌షెడ్ పథకాలను పెట్టారు. 1998-99 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 : 50శాతం నిధులు కేటాయించగా, 1999-00 నుండి 75 : 25 శాతంగా మార్చారు. వాటర్ షెడ్ కాలపరిమితిని 4 సంవత్సరాలనుండి 5 సంవత్సరాలకు పెంచారు. 1250 ఎకరాలు కల్గిన ఒక పథకానికి రు. 20 లక్షల నుండి 30లక్షలకు పెంచినట్లు శాసనసభలో ప్రకటించారు. ఇందిర ప్రభ పేరుతో దళితులకు అసైన్డ్ చేసిన భూముల అభివృద్ధికి రు. 499 కోట్లు కేటాయిస్తూ ముఖ్యమంత్రిగారు 2006లో గుంటూరు జిల్లాలో పథకాన్ని ప్రారంభించారు. ఇంతవరకు ఆ నిధులలో 50శాతం కూడా వ్యయం చేయలేదు. ఎడారి అభివృద్ధి కార్యక్రమం (డిడిపి) క్రింద మరియు ఏకీకృత బంజరు భూమి అభివృద్ధి కార్యక్రమం (ఐడబ్ల్యుడిపి) క్రింద 20 లక్షల ఎకరాల్లో 1638 వాటర్ షెడ్‌ల ద్వారా 19 జిల్లాల్లో అభివృద్ధి పథకాలు ప్రకటించారు.ఈ పథకాలకు కేంద్రం రు. 39.19 కోట్లు, రాష్ట్రం రు. 3.70 కోట్లు (11 : 1) కేటాయించాయి. దీనితో జరిగే దళితుల భూమి అభివృద్ధి ఎంత? ఇందిరమ్మ పెన్షన్ల పేరుతో 2008-09 సంవత్సరంలో రు. 15లక్షలు అదనంగా యివ్వాలని, పెన్షన్‌ను రు. 200 నుండి 500లకు పెంచాలని నిర్ణయించారు. గతంలో 26లక్షల మందికి పెన్షన్లు యిస్తున్నారు. అలాగే వృద్ధాప్య పెన్షన్లు 17.19 లక్షలు కాగా, వితంతు పెన్షన్లు 2.77లక్షలు యిస్తామన్నారు. వికలాంగులకు 01-04-2006 నుండి 2 లక్షల మందికి రు. 200 చొప్పున యిస్తున్నట్లు ప్రకటించారు. పెన్షన్లు పొందడంలో దళితులు పడుతున్న యిబ్బందులను ప్రత్యక్షంగా చూడాల్సిందే.

రాజీవ్ యువశక్తి పేరుతో ఉపాధి కల్పన, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా ప్రాజెక్టు క్రింద 30లక్షల మంది పేదవారిని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కేటాయింపులపైన ఏనాడైనా మండలస్థాయిలోగానీ, కనీసం జిల్లాస్థాయిలోగానీ అఖిల పక్షాలతో అభివృద్ధిపై సమీక్షించారా?

స్థానిక సంస్థలకు ఎన్నికైన వారికి (సర్పంచ్, ఎంపిటిసీ, జడ్‌పీటిసీ) శిక్షణ యిస్తామన్నారు. 2007-08లో 1,46000 మందికి శిక్షణ యిచ్చామన్నారు. శిక్షణ పొందినవారికి అధికారాలు యిచ్చారా? యింతవరకు పంచాయితీలకు అధికార బదలాయింపులే జరగలేదు. అందులో దళితుల పదవుల అధికారాలను ప్రస్తుత అధికార వర్గం కొనసాగనిస్తుందా? వారి అధికారాలను కూడా నేడు కొనసాగనివ్వకుండా అనేక ఆటంకాలు కల్పిస్తున్నారు.

25-10-1976న ఆర్డినెన్స్ జారీచేసి వెట్టిచాకిరీ విముక్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్, డిఆర్‌డిఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌లతో 09-06-1997న జిల్లాస్థాయి సంఘాలను ఏర్పరిచారు. వెట్టి చాకిరీ నుండి విముక్తిచేసి తక్షణం రు. 1000లు వారికి యివ్వాలి. ఆ తర్వాత రు. 10000లు వారికి యిచ్చి పునరావాసం కల్పించాలి. ప్రస్తుతం రు. 10,000లను రు. 20,000లకు పెంచారు.ఈ చట్టం అమలవుతున్నదా? ఇప్పటికీ గ్రామీణప్రాంతాల్లో గానీ, పట్టణ ప్రాంతాల్లోని ఉన్నత వర్గాల ఇండ్లలో గానీ వెట్టిచాకిరీ చేస్తున్న వారు వేలాదిగా వున్నారు. వారిని ఏ పరిస్థితుల్లోను విముక్తికాకుండా చూస్తున్నారు. ఏదో విధమైన ఆటంకాలు, రాజకీయ వత్తిడులు పెట్టి వెట్టిచాకిరీని కొనసాగిస్తున్నారు. అందుకే నేటికీ దళితుల పిల్లలు, బాలబాలికలు వెట్టి చాకిరీలో మ్రగ్గుతూనేవున్నారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్న కుటుంబాల వారే బహిరంగంగా వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా అనర్గళంగా ఉపన్యాసాలు చేస్తున్నారు.

దళితులకు కేటాయించిన స్పెషల్ ఎకనమిక్ కాంపొనెంట్ నిధులతో పాటు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు జతచేసి వారి అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి సాగిస్తే సమాజంలో వీరిని అభివృద్ధి చేయడం అంత కష్టమేమీ కాదు. కనీసం జనాభా ప్రాతిపదికగా కేటాయింపులు చేయాలి. వాస్తవానికి వెనుకబడిన వర్గాలకు జనాభా ప్రాతిపదికతో సంబంధం లేకుండానే అవసరంమేరకు కేటాయింపులు చేసి కొద్దికాలంలోనే వారిని సమాజంలోని వారితో సమానహోదాకు తీసుకురావాలి. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వారి స్థాయిని పెంచాలి. అప్పుడే ఈ కేటాయింపుల లక్ష్యం సార్థకమవుతుంది.

...

# నేర విచారణ చట్టానికి మౌలిక సవరణ పోలీసు నిర్బంధానికి ఇక చెల్లు

...✍ - సాక్షి పేపర్ సౌజన్యంతో

నూతన చట్టాలను రూపొందించడంలో, అమలులో ఉన్న చట్టాలకు అవసరమైన సవరణలు ప్రతిపాదించి మెరుగులు దిద్దడంలో భారత 14వ పార్లమెంటు విశేషమైన కృషి చేసింది. గత ఐదు సంవత్సరాల కాలంలో గిరిజన ఆటవీ హక్కులు, సమాచార హక్కు, గ్రామీణ న్యాయాలయాలు వంటి అనేక పురోగామి సంక్షేమ చట్టాలనూ, జాతీయ దర్యాప్తు సంస్థ లాంటి భద్రతా చట్టాలనూ రూపొందించింది. ఆ ఒరవడిలో గత నెల పార్లమెంటు ఆమోదించిన "క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ( ఆమెండ్‌మెంట్) బిల్లు–2008" చట్టం రూపొందించడం నేర నియంత్రణలో విప్లవాత్మకమైనదని చెప్పాలి. ఈసవరణతో నేర విచారణ చట్టం స్వరూప స్వభావాల్లో మౌలికమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. భారత రాష్ట్రపతి ఆమోదం పొందిన ఈ చట్టం ప్రభుత్వ ప్రకటన వెలువడిన వెంటనే అమలులోకి వస్తుంది.

## సవరణ నేపథ్యం

భారతదేశంలో నేటికీ బ్రిటిష్ కాలం నాటి చట్టాలే అమలవుతున్నాయన్నది ఎంతో కాలంగా వినిపిస్తున్న విమర్శ. ప్రధానంగా, సమాజంలో జరిగే నేరాల నియంత్రణకు ఉద్దేశించిన నేర శిక్షాస్మృతి(ఐపీసీ), నేర విచారణ (సీఆర్‌పీసీ) చట్టాలు స్వాతంత్ర్యానంతరం కూడా మౌలికమైన మార్పులు నోచుకోకపోవడం లోపంగానే భావించాలి. ఐదు వందలకు పైగా సెక్షన్లు కలిగిన నేర శిక్షాస్మృతి1860లో రూపొందింది కాగా, భారత సాక్ష్యాధారాల చట్టం 1872లో రూపొందింది. నేర విచారణకు సంబంధించిన క్రమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టం – 1973గా పేర్కొంటున్నప్పటికీ అందులోని దాదాపు అన్ని సెక్షన్లూ బ్రిటిష్ కాలం నాటివే. 1970 దశకంలో ఏర్పాటైన జాతీయ పోలీస్ కమిషన్ ఈ అంశాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి అనేక నివేదికలు సమర్పించింది. పోలీస్ సంస్కరణలు, నేర నియంత్రణ చట్టాల సవరణలను ప్రతిపాదిస్తూ జాతీయ లా కమీషన్ కూడా వందా, యాభైకి పైగా నివేదికలను సమర్పించింది. అలాగే, భారత అత్యున్నత న్యాయస్థానం ప్రతి సందర్భంలోనూ ఈ అంశాన్ని అనేక ఆదేశాల రూపంలో గుర్తుచేస్తూనే ఉంది. కార్ణటక మాజీ హైకోర్టు న్యాయమూర్తి మలిమత్ నాయకత్వంలో ఏర్పడ్డ కమిటీ ఒకడుగు ముందుకేసి, పోలీసు సంస్కరణలు మంచి ఫలితాలను సాధించాలంటే ముందుగా నేర విచారణ చట్టాలను మార్చకతప్పదని ప్రతిపాదించింది. ఇలా అన్నివైపుల నుండి వచ్చిన సూచనలు, సలహాలు, ప్రతిపాదనలు క్రోడీకరణగానే 'సీఆర్‌పీసీ సవరణల చట్టం' రూపొందింది.

## ప్రధాన సవరణలు

పౌరుల, రాజ్యవ్యవస్థల అస్తిత్వానికి భంగం కలిగిస్తూ ఎలాంటి హాని (దాడులు, దమనకాండ, అత్యాచారాల, కుట్రలు) తలపెట్టినా దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. అలాంటి నేరాలను క్రోడికరించి, ఏ నేరానికి ఎలాంటి శిక్ష విధించాలో నిర్దేశించే చట్టం నేర శిక్షాస్మృతి (ఐపీసీ), శిక్షించడానికి ముందు ఎలా విచారణ జరపాలో నిర్ధారించే చట్టం "నేర విచారణ చట్టం (సిఆర్‌పీసి)", సాక్ష్యాధారాలకు సంబంధించిన నిబంధనలను వివరించేది సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్). నేరం జరిగినపుడు వెంటనే ప్రారంభమయ్యే ఫిర్యాదు మొదలు అరెస్టు, విచారణ తదితర ప్రక్రియలు పోలీసులతో ముడిపడిన అంశాలు. సామాజిక భద్రతలో కీలకమైన ఈ అంశాల అమలులో పోలీసుల ప్రవర్తనపై తీవ్రమైన వ్యతిరేకతతో పాటు, విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అందుకే సీఆర్‌పీసీలో ప్రాధానమైనవిగా భావిస్తున్న తొమ్మిది అంశాలను ప్రస్తుత చట్టం ద్వారా సవరించారు. అవి.

1. అరెస్ట్ ప్రక్రియలో పోలీసుల అధికారాలను సవరించి నియంత్రించడం.
2. చిన్న నేరాల (సమన్స్, వారెంట్ కేసుల ) సత్వర విచారణ
3. కోర్టులో సాక్షులు అడ్డం తిరగడంతో కేసులు వీగిపోవడాన్ని సమీక్షించి నియంత్రించడం.
4. స్త్రీలపై పెరుగుతున్న అత్యాచారాల కేసుల్లో ప్రత్యేక భద్రతా చర్యలు.
5. పోలీసుల నిర్లక్ష్యం మూలంగా నష్టపోయిన బాధితులకు చట్టపరమైన నష్టపరిహారం కల్పించడం.
6. మానసిక వికలంగులను విచారించేటపుడు పాటించాల్సిన ప్రత్యేక చర్యలు.
7. కోర్టుల్లో కేసుల విచారణను పదేపదే వాయిదా వేసే పద్ధతులను నిరోధించడం.
8. నష్ట పరిహారంతో రాజీ చేసుకోదగిన కేసులను గుర్తించడం.
9. వీడియో కాన్ఫరేన్సు ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయడం.

ఆచరణలో తలెత్తే అడ్డంకులను అధిగమించి సవరించిన చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయగలిగితే సామాజిక,

న్యాయ, పరిపాలనా రంగాలలో మంచి ఫలితాలను సాధించవచ్చు నన్నది పరిశీలకుల అంచనా. ప్రధానంగా, విచారణలో జాప్యాన్ని నివారించడం మూలంగా పెండింగ్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. స్త్రీలపై అత్యాచారాల కేసులను రాజీ చేసుకోదగ్గ కేసుల జాబితాలో చేర్చడంపై విమర్శలున్నప్పటికీ అందులో స్త్రీల మనోభావాలకు ప్రాధాన్యత నివ్వాలన్న సూచన ఊరటగా నిలుస్తోంది. వికలాంగులు, ఖైదీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక సవరణలు చేయడం, అధికారుల నిర్లక్ష్యం మూలంగా నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్న సవరణలు భారత న్యాయ చరిత్రలోనే కొత్త అంశాలు. వీటిన్నిటికన్నా ప్రస్తుతం అందరి దృష్టినీ ప్రధానంగా ఆకర్షిస్తూ, దేశవ్యాప్తంగా న్యాయవాదుల నుంచి నిరసన ఎదుర్కొంటున్న అంశం – సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ని సమూలంగా జైళ్లశాఖపై అరవై శాతం ఒత్తిడి తగ్గి ఇప్పటి వరకూ సమాజంలో పోలీసులంటేనే నిర్బంధం అన్న అపవాదు తొలిగిపోయి. హుందాతో కూడిన నాగరిక సమాజ నిర్మాణానికి ఇది దోహదపడుతుంది. ఈ మొత్తం సవరణ చట్టంలో అత్యంత వివాదాస్పదంగా మారిన అంశంగా కూడా ఇదే.

పోలీసులు అనగానే వెంటనే గుర్తొచ్చే అంశం అరెస్టు నేరారోపణతో అరెస్టయి ఒక్కసారి జైలుకెళ్లి వచ్చిన వ్యక్తికి సమాజంలో గౌరవం తగ్గిపోతుంది. అలాగే, నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను తీవ్రంగా వెంటాడే భయంకూడా అరెస్టే. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలనూ ఇంతగా భయభ్రాంతులకు గురిచేస్తున్న అంశంగా పోలీసుల "నిర్బంధం" రీతి తప్పి ఆచరణలో అపఖ్యాతినే ఎక్కువగా మూటగట్టుకొంది. సవరించిన దాని ప్రకారం – ఏడు సంవత్సరాల లోపు శిక్ష పడే నేరాలలో పోలీసులు ఎవరినీ ముందుగా అరెస్టు చేయడానికి వీలులేదు. నేరం చేశాడని అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి (సమన్) విచారణకు సహకరించవలసిందిగా కోరాలి. సహకరించని పక్షంలో అరెస్టు చేయక తప్పదని పోలీసులు భావిస్తే ముందుగా మెజిస్ట్రేటు అనుమతి పొందాలి. అదీ సాధ్యం కాదనుకున్నప్పుడు, అలాంటి అరెస్టుకు దారి తీసిన వివరాలను నమోదు చేస్తూ ఒక మధ్యవర్తి సంతకంతో నివేదికను కోర్టుకు సమర్పించాలి. అంటే ఒకరంగా ఏడు సంవత్సరాల శిక్షార్హమైన నేరం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి జైలులో నిర్బంధించడం కాకుండా అభియోగాలను విచారించి దోషిగా కోర్టు నిర్ధారించిన తరువాతనే జైలు శిక్షను ఖరారు చేస్తారు.

**ఎందుకీ ఆందోళన**

సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ని సవరించడంపై దేశవ్యాప్తంగా మిశ్రమ స్పందన కనిపిస్తున్నప్పటికీ, వ్యతిరేకతనే ఎక్కువ ప్రచారం లభిస్తోంది. నేర విచారణలో ప్రత్యేక్ష భాగస్వామ్యాన్ని నిర్వర్తించే న్యాయవాద వర్గం దేశవ్యాప్తంగా దీన్ని నిరసిస్తోంది. కొన్ని హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు సవరణలను ఆహ్వానిస్తున్నాయి. అరెస్టులను నియంత్రిస్తే సమాజంలో నేరాల సంఖ్య పెరిగిపోయి అరాచకం తలెత్తుతుందని వ్యతిరేకిస్తున్నవారు వాదిస్తున్నారు.

అలాగే, అభియోగాలు ఎదుర్కొంటున్న వారు సహకరించడం లేదన్న నెపంతో పోలీసులు మరింతగా అవినీతికి పాల్పడే అవకాశం ఉందన్నది మరో వాదన, అరెస్టుల పేరుతో పోలీసుల నిర్బంధానికి గురవతున్న వారిలో అరవై శాతం పైగా కోర్టు విచారణ అనంతరం నిర్దోషులుగా విడుదలవుతున్నవారేనని సమర్థిస్తున్నవారు వాదిస్తున్నారు. చట్టాలు ఎంత గొప్పవైనా సామాజిక చైతన్యం పెరగనంత కాలం వాటి ఫలితాలను సాధించడం సాధ్యం కాదన్నది చరిత్ర నేర్పుతున్న పాఠం.

( ☛ 5వ పేజి తరువాయి ....)

చూపినట్లు యస్సీ, యస్టీ అభ్యర్థుల ప్రతిభను గుర్తించకుండా అడ్డుకున్నట్లు చరిత్ర సాక్ష్యం చెపుతుంది. అంతేకాకుండా ప్రాజెక్టు పూర్తి చేయడానికి, PHDలు పూర్తిచేయడానికి యస్సీ, యస్టీలు అగ్రకులాలవారిపైనే ఆధారపడవల్సి వస్తున్నది. మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందకుండా పోతున్నాయి.

ఇన్ని అన్యాయాలు జరుగుతుంటే వీటిని పరిష్కరించే ఆలోచన ఏమి చేయకుండా మొత్తం యస్సీ, యస్టీలను, IIT, IIMలకు వాటి అనుబంధ సంస్థలకు దూరంగా ఉంచాలనే SC, ST (Reservation posts and services) Bill 2008ను తీసుకురావడం దుర్మార్గం.

మరీ ఇంత దారుణాలు జరిగిపోతుంటే ఏ దళిత ఉద్యమం గానీ, దళిత నాయకులు గానీ స్పందించరేమిటి ? ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 4న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా జరిగింది. దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ధర్నాలు, నిరసనలు జరుగుతున్నాయి. గానీ, దళిత ఉద్యమాలకూ పుట్టినిల్లయిన ఆంధ్రప్రదేశ్‌లో దీని ఊసేలేదు ఎందుకూ ?

కనీసం ఇప్పటికయినా, దళితనాయకులు స్పందిస్తారా ? కనీసం ఇలాంటి సందర్భలలోనయినా వ్యక్తిగత తాత్కాలిక ప్రయోజనాలను ప్రక్కనపెట్టి ఉద్యమించకపోతే భవిష్యత్తు తరాలు క్షమించవు.

ముఖ్యంగా దళిత ఉద్యమ స్థబ్దతకూ కారణమయిన SC రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య పట్ల ఇప్పటికయినా నాయకులు పట్టు విడుపులు మానుకొని ఐక్యత–పరిష్కారం వైపు నడవకపోతే దళిత జాతి యావత్తు చీకటిలోకాలకు వెల్లక తప్పదు.

# విద్యారంగ ప్రాధాన్యతలు

...✍ - - డి. రమేష్ పట్నాయక్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి

**ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి.**

ఆధునిక సమాజంలో విద్య యొక్క ప్రాధాన్యత ఎంత ఉందో వేరుగా చెప్పనవసరం లేదు. దేశ భవిష్యత్తు తరగతి గదులలో నిర్మితమవుతుందని కొఠారి కమిషన్ చెప్పిన విషయాన్ని మనలో ఎవరు కూడా మరిచిపోలేము. అయితే దేశానికి స్వాంతత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా ఇంకా కోట్లాది మంది బాలబాలికలు పాఠశాల విద్యకు కూడా దూరంగానే ఉన్నారు. ఒక్క మన రాష్ట్రంలోనే 6-15 వయోపరిమితికి చెందిన బాలబాలికలు 20 లక్షల మంది బడిబయట ఉన్నారని లెక్క తేలుతుంది. బాలబాలికలలో 25 శాతం మంది మాత్రమే పాఠశాల విద్య (10వ తరగతి) పూర్తి చేయగలుగుతున్నారు. +2 స్థాయిలో చదువుకోగలుగుతున్నది ఇంకా తక్కువ మంది. ఉన్నత విద్య విషయానికి వస్తే అభివృద్ధి చెందిన అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాల మాట అలా ఉంచి ప్రపంచ సరాసరిని దృష్టిలో ఉంచుకున్నా భారత దేశం చాలా వెనుకబడి ఉంది. భారత దేశంలో 18-24 వయోపరిమితికి చెందిన యువతీ యువకులలో 10 శాతం మంది మాత్రమే ఉన్నత విద్య అందుకోగలుగుతున్నారు. (ఆంధ్రప్రదేశ్ 9.6 శాతం) దీనిని కనీసం ప్రపంచ సరాసరికి అంటే 30 శాతానికి పెంచవలసిన అవసరం ఉంది.

**విద్యారంగానికి సంబంధించిన అంశాలు :**

1. 3-18 వయోపరిమితిలో ఉన్న బాలబాలికలందరికీ పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి +2 స్థాయి వరకు ఉచిత విద్య, కుటుంబ పేదరికం బాలబాలికల విద్యకు అడ్డురాకుండా పాఠశాల ద్వారా వారి భోజన, వస్త్ర, వైద్య అవసరాలను తీర్చడం.
2. 18-24 వయోపరిమితిలో ఉన్న యువతీయువకులలో కనీసం 30 శాతం మందికి సమాన అవకాశాలతో ఉన్నత విద్య, అన్ని ప్రభుత్వ కళాశాలలకు అనుబంధ హాస్టళ్ళ ఏర్పాటు.
3. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం కేటాయింపు, ప్రభుత్వ విద్యా సంస్థలలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులకు ఎయిడ్ మంజూరు చేయాలి. పబ్లిక్ - ప్రవేట్ భాగస్వామ్య విధానాల రద్దు, విద్యా వ్యాపారంపై నిషేధం.
4. రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఒక నమూనా పాఠశాలగా అభివృద్ధి చేయడం, బాలబాలికల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా పాఠశాలలను నిర్వహించడం, కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం.
5. పాఠశాలలోను పెత్తందార్ల చేతుల్లో ఉన్న గ్రామ పంచాయితీలకు, పంచాయితీ ఉప సంఘాలకు అప్పచెప్పే విధానాలు రద్దు చేయడం. టీచర్- పేరెంట్ కమిటీలను ఏర్పాటుచేసి వాటిని సహాయ, సలహా సంఘాలుగా నిర్వహించడం.
6. జిల్లాలలో ఉన్న విశ్వవిద్యాలయాలను అన్ని శాఖలతోనూ, అవసరమైన భౌతిక, బౌద్ధిక వనరులతోనూ అభివృద్ధి చేయడం, జిల్లాలో ఉన్న ఉన్నత విద్యా సంస్థలన్నింటిని జిల్లాలో ఉన్న విశ్వవిద్యాలయానికి అనుబంధం చేయడం.
7. టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సులతో సమానంగా సామాజిక, ప్రకృతి శాస్త్రాల కోర్సులకు ప్రాధాన్యత యివ్వడం.
8. ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయాన్ని ఆ జిల్లా చరిత్ర, సంస్కృతులను, ఆ జిల్లా భౌగోళిక, భూగర్భ, పర్యావరణ విషయాలను, ఆ జిల్లాలో ఆర్థిక వనరులను, వివిధ ప్రజాసమూహాల సమస్యలను, హక్కులను అధ్యయనం చేయగలిగేటట్లు అభివృద్ధి చేయడం, ఈ జిల్లా విశ్వవిద్యాలయం ఒక నిర్దిష్ట పద్ధతిలో జిల్లా ప్రజలకు జవాబుదారిగా ఉండే విధంగా విధానాలను రూపొందించడం.
9. విద్యారంగంలో ప్రాథమిక స్థాయిమించి, విశ్వవిద్యాలయ స్థాయివరకు బోధన, బోధనేతర వేకెన్సీలన్నింటిలో రెగ్యులర్ ప్రాతిపదికన నియమకాలు జరపడం, వేకెన్సీలు లేకుండా నియమకాలను నిరంతరం ప్రాతిపదికన జరపడం.
10. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం ఫలహారం, సాయంత్రం పాలు వంటి పోషక ఉపాహారం అందించడం, అన్ని ప్రభుత్వం కళాశాలల్లో విశ్వవిద్యాలయాలలో అనుబంధ వసతి గృహాలు నిర్వహిస్తూ పెరిగిన ధరల కనుగుణంగా మెస్‌చార్జీలు, స్టయిఫండ్స్ పెంచడం.
11. రాష్ట్రంలో పాఠశాలవిద్య, ఉన్నతవిద్యలలో అవసరమైన మార్పులు తీసుకురావడానికి విద్యావేత్తలతో ఒక కమిషన్ నియమించడం, విద్యారంగ విషయాలలో ప్రభుత్వం ప్రజలతో అవసరమైన చర్చ జరుపకుండా తీవ్రమైన మార్పులు చేసే అప్రజాస్వామిక విధానాన్ని విడిచిపెట్టడం,

ప్రపంచ బ్యాంకు నిధులు, ఋణాల కొరకు అలాగే కేంద్రప్రభుత్వం నిధులు, ఋణాలకొరకు విద్యారంగాన్ని, రాష్ట్ర భవిష్యత్ సాంస్కృతిక జీవితాన్ని భ్రష్టుపట్టించే పద్ధతులను మానివేయడం.

## సమస్యలపై వివరణ

### 1. విద్యావకాశాల విస్తరణ :

ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు 0-18 వయోపరిమితిని బాల్యదశగా నాగరిక దేశాలన్నీ అంగీకరిస్తున్నాయి. 1992లో జామ్‌టిట్‌లో జరిగిన UNESCO కాన్ఫరేన్స్ 0-18 వయోపరిమితిని బాల్యంగా నిర్వచిస్తూ బాలబాలికలకు పౌష్టికహారం, విద్య, వైద్యం, పీడన నుండి విముక్తి, అభివృద్ధి ఆయాదేశాల ప్రభుత్వాలు గ్యారంటీ చేయాలని తీర్మానించింది. ఈ తీర్మానంపై భారత్ కూడా సంతకం చేసింది. అయితే అటు కేంద్రప్రభుత్వంగాని, ఇటు రాష్ట్ర ప్రభుత్వంగాని బాలబాలికలను ప్రకటిత హక్కుల గ్యారంటీ చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. విద్యాహక్కు విషయానికి వస్తే 2002లో 86వ రాజ్యాంగ సవరణ చేసిన NDA ప్రభుత్వం 2008 అక్టోబర్ నెలలో విద్యాహక్కు బిల్లు రూపొందించిన UPA ప్రభుత్వం బాలబాలికల విద్యాహక్కును 6-14 వయోపరిమితికి కుదించినాయి. బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య (3-5 వయోపరిమితి), ప్రాథమిక విద్య (6-14 వయోపరిమితి), సెకండరీ విద్య (15-18 వయోపరిమితి), గ్యారంటీ చేయాలి. 18 ఏళ్ళ వయస్సు నాటికి బాలబాలికలు ప్రీయూనివర్సిటీ విద్య (ఇంటర్ మీడియట్)గాని, ఉద్యోగార్హతగల విద్య (పాలిటెక్నిక్, ఇండస్ట్రీయల్ ట్రైనింగ్, వొకేషనల్ ట్రైనింగ్) గాని పూర్తి చేయగలుగుతారు. ప్రీయూనియర్సిటీ విద్య పూర్తి చేసిన వారు ఉన్నత విద్య కొనసాగిస్తే, మిగిలిన వారు ఉద్యోగం లేదా ఉపాధి చూసుకోగలుగుతారు. బాలబాలికల విద్యను 14వ ఏటకు అపివేస్తే వారు ఇటు ఉన్నవిద్యను గాని, అటు నిపుణత అవసరమైన ఉద్యోగాలకు గాని అర్హత సంపాదించరు. అసలు 15-18 వయోపరిమితిలో వారు విద్యాసంస్థలలో లేక పోతే వారి యవ్వన పూర్వదశకు మార్గదర్శకం లేకుండా పోతుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని 18వ ఏట వరకు బాలబాలికలలందరికీ ఉచితంగా విద్య/శిక్షణ గ్యారెంటీ చేయాలి. అంతేకాక బాల్యదశను 0-18 పునర్నిర్వచిస్తూ పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకై ప్రయత్నించాలి.

### 2. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం కేటాయింపులు :

రాష్ట్రంలో ఉన్నత విద్య విస్తృతంగా వ్యాపారీకరణకు గురయింది. విద్యా, వైద్యం, త్రాగునీరు వంటి వాటిని కూడా వ్యాపారంపరం చేస్తే మన రాజ్యాంగంలో చెప్పుకునే సంక్షేమరాజ్యానికి అర్థం ఏముంటుంది. ప్రపంచవ్యాపితంగా గత రెండు దశాబ్దాలుగా ప్రపంచబ్యాంకు మార్గ దర్శకత్వంలో అమలు జరుగుతున్న సంస్కరణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే కుదిపివేసిన, తీవ్ర సంక్షోభానికి గురిచేస్తున్న సందర్భాలలో మనం ఉన్నాము. ఈ పరిస్థితులలోనైనా సామాజిక సేవరంగాలకు మార్కెట్ శక్తుల నుండి విముక్తి కల్పించవలసిన అవసరం ఉందని గుర్తించవలసి ఉంది. విద్యారంగం ప్రైవేటీకరణకు నిధుల కొరతే ప్రధాన కారణం అన్న వాదనలో ఎటువంటి పస లేదు. కొఠారి కమిషన్, ఖేర్ కమిషన్, తపస్ మజుందార్ కమిటీలు ప్రతిపాదించినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్ కేటాయింపుల ద్వారా జాతీయ స్థూల ఉత్పత్తిలో 6 శాతం విద్యకు కేటాయిస్తే (మరొక విధంగా చెప్పాలంటే కేంద్రం తన బడ్జెట్‌లో కనీసం 50 శాతం, రాష్ట్రం తన బడ్జెట్‌లో కనీసం 20 శాతం విద్యకు కేటాయిస్తే ) నిధులకొరత అన్న సమస్య తలెత్తదు. మన రాష్ట్ర విషయానికి వస్తే ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం కేటాయించారు. తరువాత కాలంలో కేటాయింపులు క్రమంగా తగ్గుతూవచ్చాయి. 2008-09 రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించినది 10.5 శాతం మాత్రమే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్‌లలో వరుసగా 10 శాతం, 20 శాతం విద్యారంగానికి కేటాయిస్తే విద్యావిస్తరణ లక్ష్యాలకు భంగం కలుగకుండా విద్యావ్యాపారాన్ని నిషేధించవచ్చు.

### 3. యువతీయువకులలో 30 శాతానికి సమాన అవకాశాలతో ఉన్నత విద్య :

మనరాష్ట్రంలో ఉన్నత విద్యారంగాన్ని విస్తరించవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలస్తే 17-23 వయోపరిమితి యువతీ యువకులలో కెనడాలో 100 శాతం, అమెరికాలో 70 శాతం, ఐరోపాలో 40 శాతం ఉన్నత విద్య పొందుతున్నారు. సిగ్గు చేటైన విషయం ఏమంటే మనకంటే పేద దేశాలైన మన యిరుగు పొరుగు దేశాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో కూడా యువతీయువకులలో విద్యార్థుల శాతం మనదేశం కంటే ఎక్కువే 17-23 వయోపరిమితిలో మన దేశంలో విద్యా సంస్థలలో చదువుకుంటున్న యువతీ, యువకులు సుమారు 10 శాతం మాత్రమే కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది 9.6 శాతంగా మాత్రమే ఉండడం మరింత ఆందోళన కలిగించే విషయం. కటిక దారిద్ర్యంలో ఉన్న 50 దేశాలతో కలిసి ప్రపంచంలో సరాసరిన 17-23 వయో పరిమితిలో ఉన్న యువతీయువకులలో ఉన్నత

విద్య అభ్యసిస్తున్న వారు 30 శాతం అని లెక్క తేలింది. ప్రపంచంలో విద్యారంగంలో మనం అగ్రగాములం కావటం మాట అటువుంచి ప్రపంచ సరాసరిని అందుకోవాలన్నా కనీసం 30 శాతం యువతీ యువకులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాలి.

## 4. కొత్త విశ్వవిద్యాలయాల సమగ్ర అభివృద్ధి :

ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం పెట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి సుమారు గత 10 సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ ఉంది. కాగా ప్రస్తుతం అధికారంతో ఉన్న ప్రభుత్వం సుమారు ఆపని పూర్తి చేసింది అయితే ఈ ప్రభుత్వం ఈ కొత్త విశ్వవిద్యాలయాలకు ఒక్కొక్కదానికి కేటాయించింది. 5 లేక 10 కోట్లరూపాయలు మాత్రమే (కడప వేమన విశ్వవిద్యాలయం తప్ప) ఒక మంచి కాన్సెప్ట్ స్కూల్ పెట్టడానికి 12 కోట్ల రూపాలయలు అవసరమవుతుందని అంచనా వేసిన ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు 5 కోట్ల రూపాయల చొప్పున మాత్రమే కేటాయించిందంటే ఎలా అర్థం చేసుకోవాలి. (నిజానికి కేటాయించిన దానిలో విడుదల చేసింది చాలా తక్కువ) ప్రతి జిల్లాలో ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాన్ని అన్ని శాఖలతో అవసరమైన వనరులతో అభివృద్ధి చేయాలి. అందుకవసరమైన నిధులను కేటాయించాలి. అంతేకాదు ప్రతి జిల్లాలో ఉన్న ఉన్నత విద్యా సంస్థలన్నింటిని కనీసం. ప్రారంభంలో వృత్త్యేతర విద్యాసంస్థలనన్నింటిని జిల్లా విశ్వవిద్యాలయానికి అనుబంధం చేయాలి. అలాగే జిల్లా విశ్వవిద్యాలయం జిల్లా ప్రజలకు జవాబుదారిగా ఉండే విధి విధానాలను రూపకల్పన చేయాలి.

## 5. ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యం రద్దు :

ప్రపంచబ్యాంకు సలహా మేరకు ఈ మధ్య కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ ప్రవేటు భాగస్వామ్య విధానాలను అవలంభిస్తున్నాయి. ఈ విధానాలు నిజానికి పబ్లిక్ వనరులను ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తం చేయడానికే ఉపకరిస్తాయని యిప్పటికే ఆరోగ్య పథకం ద్వారా ఋజువయిపోతుంది. ప్రస్తుతం విద్యారంగంలో కూడా కాన్సెప్ట్ పాఠశాలల పేరుతో ఇదే ప్రయత్నం చేసింది. అయితే ప్రజల నుండి వెల్లువెత్తిన వ్యతిరేకత వలన వెనక్కితగ్గింది. అయితే కేంద్రప్రభుత్వం 11వ పంచవర్ష ప్రణాళికలో విద్యారంగానికి సుమారు 20 శాతం కేటాయింపులు చేస్తూ దానిని ప్రభుత్వ ప్రవేటు భాగస్వామ్యం ద్వారానే వ్యయం చేయాలని నిర్దేశించింది. ప్రజల సొమ్మును ప్రైవేటు యాజమాన్యలకు ధారదత్తం చేసే ఈ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) విధానాలను రద్దు చేయాలి. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులనన్నింటిని ప్రభుత్వ, ప్రస్తుత, భవిష్యత్ విద్యాసంస్థల ద్వారానే ఖర్చుచేయాలి.

## 6. మౌలిక సామాజిక, ప్రకృతి శాస్త్రాలకు ప్రాధాన్యత :

మన రాష్ట్రంలో టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సులకున్న ప్రాధాన్యత సామాజిక, ప్రకృతి శాస్త్రాలకు లేకుండా పోయింది. ఒక కాలంలో ప్రైవేటు రంగంలో ముందుకు వచ్చిన కొన్ని రకాల ఉద్యోగావకాశాల వెంట సాధారణ విద్యార్థుల పడడం సహజమే. అయితే సమాజానికి, సమాజ భవిష్యత్తుకు ప్రాతినిధ్యం వహించవలసిన ప్రభుత్వం కూడా వేలం వెర్రిగా మార్కెట్‌వెంట పడి పోవడం దురదృష్టకరం ఇప్పటికైనా మార్కెట్ శక్తులు సమాజాన్ని సంక్షోభం వైపుకే నడిపించగలవని గ్రహించి విద్యారంగాన్ని మార్కెట్ ప్రాధాన్యతల నుండి విముక్తి చేసి సామాజిక ప్రకృతి శాస్త్రాలకు అవసరమైన ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంది. సామాజిక ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి తగినంత మంది విద్యార్థులు రావడంలేదు వచ్చిన వారికైనా గుణాత్మకమైన విద్య అందించవలసి ఉంది. అన్ని డిగ్రీ కళాశాలలు, పి.జి. సెంటర్‌లు, విశ్వవిద్యాలయాలో పోస్టులను వెంటనే భర్తీచేయవలసిన అవసరం ఉంది, లేబొరేటరీలను, లైబ్రరీలను అధునికీకరించవలసిన అవసరం ఉంది గ్రామాలనుంచి పట్టణాలకు చదువు కోవడానికి వచ్చిన పేద, దళిత విద్యార్థులందరికీ, అన్నికోర్సులవారికి హాస్టల్ వసతి కల్పించవలసిన అవసరం ఉంది.

## 7.యువత ఉద్యోగ, ఉపాధి హామీ :

దేశంలో, రాష్ట్రంలో, ఉద్యోగం, ఉపాధి దొరకని స్థితిలో యువత నిర్వేదంతో కృంగిపోతూంది. యువత అధిక శాతంగాగల మన జనాభా నిజానికి దేశాభివృద్ధికి ఒక బలమైన ప్రాతిపదిక. ఈ యువత విద్య, సామాజికంగా అవసరమైన నైపుణ్యాలను అందించగలిగితే భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా ఉండగలుగుతుంది. అయితే మన ప్రభుత్వాలు యువతను భారంగా చూస్తున్నాయి. భారంగా తయారుచేస్తున్నాయి. ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజారోగ్యం, త్రాగునీరు, సాగునీరు, ప్రజాపంపిణీవ్యవస్థ వంటివాటిని విస్తరించడం ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు. అలాగే సరుకు రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల టోకు చిల్లర వ్యాపారం వంటి వాటిని పబ్లిక్ రంగంలోనికి తీసుకువచ్చి అందులో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడమే గాక మరిన్ని లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు. విశ్వవిద్యాలయాలలో యువతీ యువకులు తమ భవిష్యత్ గురించి ఆందోళన పడవలసిన అవసరం లేనప్పుడే విద్యా రంగంపై దృష్టి పెట్టగలరు.

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు : డిసెంబర్ 2008 - జనవరి 2009

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1. | కరీంనగర్ | కులదూషణ, దాడి | 03.12.2008 మానకొండూరు, అన్నారం గ్రామంలో ఇటీవల దసరా వేడుకుల జమ్మివతన్‌కు సంబంధించి తలెత్తిన గొడవల్లో రొడ్ల నరేందర్‌ను అదే గ్రామానికి చెందిన 12 మంది కులంపేరుతో దూషించి, దాడి చేసి, గాయ పరిచారు. |
| 2. | హైదరాబాద్ | కులదూషణ, దాడి | 04.12.2008 పంజాగుట్ట, సోమాజిగూడలోని ఒక ప్రైవేట్ కంపెనీలో స్టాఫ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వంశీకృష్ణకు అతని భార్యకు మధ్య గొడవలుండడంతో భార్య సంధ్య బోడుప్పల్‌కు చెందిన చైతన్య మహిళా మండలి సభ్యులతో కలిసి విషయం వివరించగా కౌన్సిలింగ్ చేయడానికి వచ్చిన సభ్యురాలు మరియు అడ్వకేట్ అయిన ధనలక్ష్మిని కులంపేరుతో దూషించి, దాడికి పాల్పడిన వంశీకృష్ణ. |
| 3. | హైదరాబాద్ | దాడి | 09.12.2008 మల్కాజిగిరి, చాణక్యపురిలో నివసించే వేంకటేష్ మరియు కిశోర్ ప్రక్కగదులలో అద్దెకు ఉంటున్నారు. కిశోర్ టివి సౌండ్ ఎక్కువపెట్టడంతో తగ్గించాలని కోరిన వెంకటేష్‌పై దాడి చేసి గాయపరిచాడు. |
| 4. | నిజామాబాద్ | అస్వస్థత | 11.12.2008 కులాస్‌పూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 100 మంది విద్యార్థులకు అస్వస్థత. |
| 5. | నెల్లూరు | కులదూషణ | 12.12.2008 సైదాపురం, కలిచేడు, అరుంధతీయ వాడలో బొడ్డు రత్తమ్మ ఇంటి ప్రక్కనున్న బెట్టుకొమ్మలను నరుకుతుండగా విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో ఇరువురి మధ్య మాటా, మాటా పెరిగి ఆమెను కులం పేరుతో దూషించిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు. |
| 6. | అనంతరపురం | దాడులు | 10.12.2008 రాప్తాడు నియోజక వర్గంలో ఎస్సీ, ఎస్టీలపై తెలుగు దేశం నాయకులు దాడులు పెరుగుతున్నాయని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగాల రమేష్‌బాబు ఆరోపించారు. |
| 7. | తూర్పుగోదావరి | దాడి | 15.12.2008 మండపేట, ద్వారపూడి గ్రామం వేములపల్లి, గుర్భా బీడుకాలనీలో నివాసం ఉంటున్న దూలం సత్యవతి. కాలనీ వారిపై బాణామతి, చేతబడి వంటి క్షుద్రశక్తులు ప్రయోగిస్తుందనే అనుమానంతో అర్ధరాత్రి గ్రామస్తులు ఆమెపై దాడి చేశారు. |
| 8. | హైదరాబాద్ | లంచం | 20.12.2008 సరూర్‌నగర్ ఎసిపి హర్షవర్ధన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో లంచం తీసుకుంటూ అవినీతినిరోధక శాఖ అధికారులకు దొరికిపోయాడు. ఎసిపిని సస్పెంట్ చేశారు. |
| 9. | నిజామాబాద్ | కులదూషణ | 17.12.2008 ఎల్లారెడ్డి మండలంలోని, కళ్యాణి గ్రామానికి చెందిన వసంతను జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించారు. |
| 10. | ప్రకాశం | కులదూషణ | 18-12-2008 ఉలవపాడు మండలంలోని ఆకుతోట సంఘంలో బుధవారం ప్రభుత్వాదేశాల మేరకు అటవీ భూమిని సర్వే చేస్తున్న శ్రీశైలంకు చెందిన ముగ్గురు విటిడిఎ సర్వేయర్లను కులంపేరుతో దూషించిన అటవీ గార్డుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు. |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేదీ/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 11. | మహబూబ్‌నగర్ | కులదూషణ | 27.12.2008 నాగర్ కర్నూల్ టౌన్‌లోని ఇంటర్, డిగ్రీ బాలికల వసతి గృహంలో అన్నంలో పురుగులు, పాలిథిన్ కవర్లు దర్శనవచ్చాయి. |
| 12. | నెల్లూరు | కులదూషణ | 30.12.2008 ఓజిలి మండలం, కురుగొండకు చెందిన రావూరు నాగమణి అనే దళిత మహిళను కులం పేరుతో దూషించిన 5గురు దళితతేతరులు దీనికి పాతగొడవలే కారణమని పోలీసులు పేర్కొన్నారు. |
| 13. | రంగారెడ్డి | కులదూషణ | 01.01.09 ఘట్‌కేసర్, అన్నోజిగూడ గ్రామానికి చెందిన గాంధారి అచ్చయ్యను కులంపేరుతో దూషించిన శంకర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినా, ఇంకా కేసు నమోదు చేయలేదు. |
| 14. | నల్గొండ | మంత్రాల నెపంతో దాడి | 01.01.2009 త్రిపురారం మండలం, రాగడప గ్రామపంచాయితీ పరిధిలోగల పెద్దతండాకు చెందిన పానుదోతు టమా తమ కుటుంబానికి చెందిన వారిపై మంత్రాలు (చేతబడి) చేస్తున్నారనే నెపంతో పానుగోతుసామ కుటుంబానికి చెందిన నలుగురు వారిపై దాడి చేశారు. దానికి ప్రతిగా భాదితులు, నిందుతులపై ఎదురు దాడి చేశారు. |
| 15. | నల్గొండ | అత్యాచారం | 01.01.2009 చిట్యాల మండల పరిధిలో ఒక మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు వ్యక్తులు అంతేకాకుండా వారు ఆమె శీలానికి వెలకట్టారు. |
| 16. | హైదరాబాద్ | అత్యాచారం | 02.01.2009 తార్నాక, పార్శిగుట్టకు చెందిన 23 సంవత్సరాల యువతిని నిర్భందించి అనేక సార్లు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులు  ఉమెన్ ప్రోటెక్షన్ సెల్ జోక్యంతో కేసు నమోదు చేసిన పోలీసులు. |
| 17. | ఖమ్మం | అత్యాచారం | 08.01.2009 కొత్తగూడెంలో 2007 ఫిబ్రవరి 17వ తేదిన ఇంటర్మీయట్ విద్యార్థినిని రామవరానికి చెందిన షేక్, అమర్, వంశీ ఇంకా తొమ్మిది మంది సామూహిక అత్యాచారం చేశారు. |
| 18. | హైదరాబాద్ | అత్యాచారం | 08.01.2009 ఉప్పల్, పార్శిగుట్టకు చెందిన మైనర్ బాలిక (17)కు మధ్యం తాగించి, విజయ్‌కుమార్, బంటి దయానంద్‌లు అత్యాచారంచేశారు. తరువాత నాగారంలోని ప్రశాంత్ ఇంటిలో బంటి భార్యగా రెండు రోజులు ఉంచి ఆమెపై అత్యాచారం చేశారు. తరువాత ఆమెను పార్శిగుట్టలో వదిలేయగా, ఆటో డ్రైవర్ బాలు సఫిల్‌గూడలోని తన మిత్రుడు రమేష్ ఇంటికి తీసుకెళ్ళి అత్యాచారం చేశారు. నిందుతులను పోలీసులు అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. |
| 19. | గుంటూరు | కులదూషణ, దాడి | 06.01.2009 అమృతలూరుకు చెందిన నార్ల శ్రీను, కంచర్ల రఘువరావు కలిసి వ్యాపారం చేసేవారు. వారి మధ్య విభేదాల వలన విడిపోయి ఎవరి వ్యాపారం వారు చూసుకుంటున్నారు. రాఘువరావు వ్యాపారం అభివృద్ధి చెందడంతో అసూయ పెంచుకున్న శ్రీను, వెంటేశ్వర్ రావు, రాఘువేంద్రరావులు 2007 ఏప్రిల్ 4న రఘువరావుపై దాడి చేసి కులం పేరుతో దూషించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష మరియు జరిమానా విధించడం జరిగింది. |
| 20. | గుంటూరు | కులదూషణ, దాడి | 06.01.2009 దుగ్గిరాల మండలం, పెనుమూరి గ్రామానికి చెందిన పాదర్తి నాగేశ్వరరావు, ఏసు అనే వ్యక్తులు ఈ నెల 3న తమ పోలంలో కుప్పనూర్పిడికి |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| | | | లక్ష్మయ్య పోలంద్వారా ట్రాక్టర్ తీసుకెళ్ళారు. అది తెలుసుకున్న లక్ష్మయ్య వాదోపవాదాలకు దిగి, నాగేశ్వర్‌రావును కులంపేరుతో దూషించి, దాడికి దిగాడు. |
| 21. | నిజామాబాద్ | మంత్రాల నెపంతో దాడి | 05.01.2009 మోషంపూర్‌లో గత వారం రోజులుగా కల్లెం, మణవ్వ, రోజయ్య ఇంట్లో బట్టలు కాలిపోవడంతో గ్రామానికి చెందిన కొందరు మంత్రాలు చేస్తున్నారనే నేపంతో ఎల్లయ్య, వెంకవ్వ, రాములు, పెద్దలక్ష్మి, శివనాగరాజులపై దాడి చేశారు. |
| 22. | ప్రకాశం | కులదూషణ | 05.01.2009 అద్దంకి (ముండ్లమూరు) వేలమూరి పాడు గ్రామానికి చెందిన దళితుడు కంకణాల రవీంద్రబాబు తన కుమారుని ఆరోగ్యం కాపాడుకునేందుకు కలెక్టర్, ఎస్సీ కార్పోరేషన్ ఇ.డి.లను కలవగా రూ॥75 వేల రుణాలను మంజూరు చేశారు. బ్యాంకులకు కూడా ఉత్తర్వులు అందడంతో తన రుణం ఇవ్వవలసిందిగా కోరిన రవీంద్రబాబును నీకు రుణం ఇవ్వనంటూ కులం పేరుతో దూషించిన బ్యాంకు మేనేజర్. |
| 23. | హైదరాబాద్ | మంత్రాల నెపంతో దాడి, ఇంటిని బదలాయింపు | 09.01.2009 వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన వెంకటయ్య, మల్లమ్మ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి పార్శిగుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారు బాణామతి చేయడం వల్లనే తమ భర్తమరణించాడని అదే ప్రాంతంలో ఉంటున్న వసంత మరియు అతని బంధువులు వారిని నమ్మకంగా ఇంటికి పిలిపించి, అర్ధనగ్నం చేసి, వారిని చితకబాదారు. వారి ఇంటిని వసంతపేరుతో వ్రాయించుకొని ఆ ప్రాంతం వదిలి వెళ్ళాలని బెదిరించారు. |
| 24. | మహబూబ్‌నగర్ | జోగిని | 08.01.2009 మద్దూరు మండలం, నందిపాడ్‌లోని ఇద్దరు యువతులను జోగినీలుగా మార్చిన స్వామిజీ |
| 25. | కర్నూలు | దాడి | 31.12.2008 నందవరం, మాచాపురం గ్రామంలో దళితులపై దాడి చేసిన బోయలు. |
| 26. | కరీంనగర్ | కులదూషణ, దాడి | 03.01.2009 జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో దళిత రేషన్ డీలర్ అయిన ప్రభాకర్‌ని ఎంపిటిసి సుధాకర్ అకారణంగా చేయిచేసుకుని కులంపేరుతో దూషించాడు. |
| 27. | వరంగల్ | కులదూషణ | 07.01.2009 గోపాలపురం, పెదుళ్ళకుంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీనివాస్, దేవకుమారి రామచంద్రం, రమేష్ అనే వారు అదే గ్రామానికి చెందిన చింతలపూడి వెంకట్రావు అనే దళితుడిని కులంపేరుతో దూషించారు. |
| 28. | మెదక్ | అత్యాచారం | 14.01.2009 సంగారెడ్డి అర్బన్, ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామానికి చెందిన ఐదేళ్ళ మైనర్ బాలికపై వరుసకు అన్నయ్య అయిన మహేష్ (20) అత్యాచారం చేశాడు. |
| 29. | వరంగల్ | అత్యాచారం | 07.01.2009 ఇనుగుర్తి శివారు వీరారెడ్డిపల్లికి చెందిన 16 ఏళ్ళ గిరిజన బాలికపై అత్యాచారయత్నం చేసిన విజెందర్ |
| 30. | అనంతపూర్ | కులదూషణ, దాడి | 10.01.2009 నందలపాడుకు చెందిన ఓబుళమ్మ డిష్‌గదిలో 30 వేల రూపాలయల విలువైన సామాగ్రి చోరీకి గురయ్యాయి. పోలీసులు నిందితులను పట్టుకున్నారు. తరువాత పీర్లమన్యంకు చెందిన షేర్‌ఖాన్ అనే వ్యక్తి పది మందితో కొడవళ్ళు, |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| | | | కర్రలతో డిష్ వద్ద ఓబుళమ్మపై దాడికి ప్రయత్నించి, ఆమె కొడుకు నాగాభూషణం కనబడితే చంపుతామని బెదిరించి, కులం పేరుతో దూషించారు |
| 31. | హైదరాబాద్ | కులదూషణ | 16.01.2009 బేగంబజార్, జాంబాగ్ ప్రాంతానికి చెందిన గీత అదే ప్రాంతంలో పండ్లు అమ్ముకుంటుంది. కాగా ఆమెను పండ్ల దుకాణం యజమాని కలీం, అతడి స్నేహితులు షపి, ఖలీల్, తాహిర్‌లు కులంపేరుతో దూషించారు. |
| 32. | అనంతరపూర్ | దాడి | 12.01.2008 రాయదుర్గం నియోజక వర్గంలోని ............... గ్రామాలలో మరియు నియోజక వర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నాయి. |
| 32. | హైదరాబాద్ | హత్య | 19.01.2009 అల్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా, తిమ్మాజీపేట మండలం, మరికల్ గ్రామానికి చెందిన దంపతులు వర్షవత్ బుజ్జి, సుకియాలు తమ ముగ్గురు సంతానంతో టెంపుల్ అల్వాల్‌లో నివసిస్తున్నారు. భార్య బుజ్జిని ఆమె చీరతోనే ఉరివేసి చంపి, ముళ్ళ పొదల్లో వదలి వేసిన అగంతకులు |
| 33. | నెల్లూరు | అత్యాచారం | 16.01.2009 గూడూరు (మం) నాయక్‌పల్లి గ్రామానికి చెందిన కాంపాటి సురేష్ అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను నమ్మించి, గర్భవతిని చేశాడు. గర్భస్రావం చేయడానికి ప్రయత్నించాడు. |
| 34. | రంగారెడ్డి | అత్యాచారం | 22.01.2009 ఘట్‌కేసర్, అంకుశాపురం గ్రామానికి చెందిన బీరెడ్డి మల్లారెడ్డి వద్ద దళిత ప్రభాకర్, స్వప్నదంపతులు కూలీ పనికి కుదిరారు. భర్త ప్రభాకర్‌ను బీరు తీసుకురమ్మని బయటికి పంపి అతని భార్య స్వప్నపై అత్యాచారం చేసిన మల్లారెడి. |
| 35. | హైదరాబాద్ | మైనరుబాలికపై అత్యాచారం | 22.01.2009 కుత్బుల్లాపూర్, ఎల్‌కెజి చదువుతున్న మైనర్ బాలిక (5)పై బాలుడు (14) అత్యాచారం చేశాడు |
| 36. | ప్రకాశం | కులదూషణ | 20.01.2009 మార్కాపురం, మంచినీటి పథకం పైపు లైను విస్తరణలో భాగంగా పనిలో ఉన్న ప్రొక్లయిన్ ఆపరేటర్ జాన్ బాబును, సురేంద్రబాబు కులంపేరుతో దూషించాడు. |
| 37. | కర్నూలు | కులదూషణ, దాడి | 19.01.2009 లారీ బ్రోకర్‌గా పనిచేస్తున్న సంజన్నను తమ లారీలను పంపకుండా పది టైర్ల లారీని మార్కెట్ యార్డ్ షాపుకు పంపినందుకు కులంపేరుతో దూసించి, దాడి చేసిన అహ్మద్, షఫీ, ఎల్లప్ప. |
| 38. | రంగారెడ్డి | కులదూషణ | 21.01.2009 కీసర శివమాల వేసుకున్న దళితుని, తోటి అగ్రవర్ణాలవారు కులం పేరుతో దూషించారు. |
| 39. | తూర్పుగోదావరి | అంబేద్కర్ విగ్రహానికి అవమానం | 13.01.2009 తూర్పుగోదావరి జిల్లా, అంబాజిపేట (మం) వక్కలంకలో అంబేద్కర్ విగ్రహానికి దుండగులు తారుపూసి, అవమానించారు. |
| 40. | హైదరాబాద్ | అత్యాచారం | 22.01.2009 కాచిగూడ, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఎస్సీ మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన బిహెచ్ఇఎల్ ఉద్యోగి బి. రంగయ్య. |
| 41. | తూర్పుగోదావరి | దాడి | 17.01.2009 జగ్గంపేట, సామర్లకోట తీర్థంలో కొంతమంది దళిత అగ్రవర్ణాలకు చెందిన యువకులు దళిత యువతులను అవమానించి, దాడులు చేశారు. |

# కంధమాల్ గంధకం

కంధమాల్ గంధకం
తెలుగు నేలని దాటి
కన్నడదేశానికీ పాకింది

అహింసని బోధించిన
అశోకధర్మ చక్రాన్ని కాలదన్ని
భజరంగ్‌దళ్‌ల భజనలు
జ్ఞానదీక్ష బోధించిన బసవడు నడయాడిన
నేలనీ బెదిరిస్తున్నాయి

దూరాల నుంచి తీరాలు దాటివచ్చి
ఈ నేల బాగు కోసం ఈ గాయలకే కట్టుకట్టిన
క్రైస్తవంపై కత్తిగట్టి, చెరపట్టి
నడిబజాట్లో అత్యాచారమౌతుంది రామనామం

అరేబియా తీరాన ఆ తాజ్‌లో
మూడు రోజుల మరణానికి
కన్నీరు కార్చింది త్రివర్ణం
మరి రోజూ చచ్చి బతుకుతున్న
సిలువల శరీరాల్ని
పటోళి దురంతాల్ని ఖండించే
గుండెధైర్యం నీకుందా !

సోదరా
సిలువల్ని ఆయుధాలుగా మలుద్దాం
చూపుడేళ్ళి ఎక్కుపెడదాం
గంగ సింధు బంధువులకి ఉరేద్దాం
లేకుంటే చర్చిసెంటర్లో పాతరేద్దాం

...✍ - డా॥ జి.వి. రత్నాకర్


మీ అభిప్రాయాలను ఈ క్రింది చిరునామాకు పంపండి.

**సాక్షి** హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.

**ఇం.నెం. 10-3-129, 2వ అంతస్తు, టీచర్స్ కాలనీ,**
**ఈస్ట్‌మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**
**ఫోన్ : 040- 65440969, ఫ్యాక్స్ : 040- 27737086**

ఇ-మెయిల్ sakshi_ap@satyam.net.in
వెబ్‌సైట్ : www.sakshiap.org

**Toll Free Dalit Call No - 18004255535, 27737093**


**Book-Post** **Printed Matter**

**To**


Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Right Watch, A.P. Secunderabad - 500 026.